క్లుప్తంగా

విద్యార్థులకు భోజనం ప్లేట్లు వితరణ



ప్లేట్లను అందజేస్తున్న దృశ్యం

కవిటి: మండలంలోని కె.కపాసుకుద్ది పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులకు తూతిక వెంకటరమణ మధ్యాహ్న భోజనం చేసేందుకు వీలు ప్లేట్లను వితరణగా సమకూర్చారు. ఈయన ముత్యాలపేట ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఎంటీఎస్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. ప్లేట్లను హెచ్ఎం బల్లెడ భారతీదేవి సమక్షంలో శనివారం విద్యార్థులకు అందజేశారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని మండల విద్యాశాఖ అధికారి బి.వెంకటరమణ అన్నారు. హుకుంపేట ప్రాథమిక పాఠశాలలో 90 మంది విద్యార్థులకు హోం వర్కు డైరీలు, తెలుగు, ఇంగ్లిష్ కాపీ రైటింగ్ పుస్తకాలను ఉపాధ్యాయుడు గున్న సుభాష్ సమకూర్చారు. వీటిని శనివారం పిల్లలకు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు మెట్ట మోహనరావు, పీఎంసీ చైర్మన్ సింహాచలం, ఉపాధ్యాయులు సత్యన్నారాయణ, సుగుణ, స్వాతి పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని ప్రదర్శించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సింహాచలంనాయుడు

కవిటి: శాస్త్రసాంకేతిక రంగాల్లో సైతం గ్రామీణ ప్రాంత విద్యార్థులు సృజనాత్మకత, నైపుణ్యం ప్రదర్శించాలని కవిటి జీజే కళాశాల ప్రిన్సిపాల్ పి.సింహాచలంనాయుడు అన్నారు. కవిటి కళాశాలలో శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమ ఉద్దేశాన్ని ఫిజిక్స్ కాంట్రాక్ట్ లెక్చరర్ బొడ్డ శ్రీనుబాబు వివరించారు. అంతరిక్ష రంగంలో విశేష సేవలందించిన శాస్త్రవేత్తలకు నివాళులర్పించారు. విద్యార్థులు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

అక్కరకు రాని రీ సర్వేరాళ్లు!



జీడితోటలో వృథాగా ఉన్న రీ సర్వే రాళ్లు

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండలంలో పలు చోట్ల రెవెన్యూ శాఖకి సంబంధించిన రీ సర్వే రాళ్లు నిరుపయోగమై అక్కరుకు రాకుండా పోయాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన వీటిని రెవెన్యూశాఖ భద్రపరచడంలో విఫలమైంది. పైగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తయారు చేసినవి కావడంతో కూటమి నేతల ఆదేశాలతో కావాలనే వినియోగించడం లేదు. పోనీ ఆ రాళ్లను సద్వినియోగం చేసుకోవడంలో ఏమైనా ఆలోచన చేస్తోందా అంటే అదీ లేదు. దీంతో సర్వే రాళ్లు పూండి ఉద్దానం ప్రాంతంలోని అమలపాడు, ఉద్దానం నర్సింగపల్లి, దేవునల్తాడ, సూర్యమణిపురం తదితర ప్రాంతాల్లోని జీడి, కొబ్బరి తోటల్లో వృథాగా పడి ఉన్నాయి.

వంశధార కాలువ పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పలాస: పలాస నియోజకవర్గంలోని వంశధార ఎడమ కాలువను కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో అంతరకుద్ద వద్ద జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా శివారు భూములకు ఎన్ని రోజుల్లో సాగునీరు వెళ్తుంతో ఆరా తీశారు. ప్రస్తుతం వజ్రపుకొత్తూరు మండలం పెదబాడాం వరకు శనివారినికి నీరు చేరిందని వంశధార అధికారులు చెప్పారు. వంశధార ఈఈ శేఖర్‌బాబు, ఏఈ రాజశేఖర్, నీటి సంఘం ప్రతినిధులు గొనప నిరంజన్, బడ్డ నాగరాజు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు




ఫాగింగ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పలాస: దోమల నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని పలాస–కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. ఇందులో భాగంగా అన్ని మురికివాడల్లో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయిస్తున్నామని చెప్పారు. కాశీబుగ్గ పాత బస్టాండు, సులాబ్ కాంప్లెక్సు, అన్న క్యాంటీన్, కె.టి.రోడ్డు, ముత్యాలమ్మ కోనేరు తదితర ప్రాంతాల్లో శనివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

ఎదురు చూపులే మిగిలాయి!

- అమలుకాని నిరుద్యోగ భృతి
- అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా దృష్టిపెట్టని కూటమి ప్రభుత్వం



చంద్రబాబు సూపర్‌సిక్స్‌లో ఇచ్చిన హామీ పత్రం

వజ్రపుకొత్తూరు: ఇంటికో ఉద్యోగం వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి రూ. మూడు వేలు ఇస్తానంటూ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా దీనిపై నోరు మెదపకపోవడం నిరుద్యోగులను ఆందోళనకు గురి చేస్తోంది. యువతీ యువకులకు భారీ సంఖ్యలో కొలువులు వస్తాయని లేదంటే రూ. మూడు వేలు నిరుద్యోగ భృతి వస్తుందని ఎదురు చూస్తున్నారు. మరో పక్క ఎన్నికల సమయంలో ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాలు ఏమైయ్యాయంటూ కూటమి ప్రభుత్వాన్ని నిరుద్యోగులు నిదీస్తున్నారు.

నియోజకవరగంలో ఇదీ పరిస్థితి..

పలాస నియోజకవర్గంలో నిరుద్యోగం నిత్యం పెరిగిపోతుంది. నియోజకవర్గం పరిధిలో వజ్రపుకొత్తూరు, మందస, పలాస మండలాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో బీఈ, బీటెక్, డిగ్రీ, ఇంటర్మీడియెట్, డిప్లమో, పదో తరగతి చదివిన దాదాపు 7,300 మంది వరకు నిరుద్యోగులు ఉన్నారు. వీరికి ఉద్యోగాల్లేక ఏటా సుమారు 2,500 మంది వెల్డింగ్ ఇతర నైపుణ్య శిక్షణ తీసుకుని విదేశాలకు వలస కూలీలుగా వెళ్లిపోతున్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్‌లో నిరుద్యోగులకు పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటించారు. 20 లక్షల ఉద్యోగాలతో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనతో పాటు ఉద్యోగం వచ్చేంత వరకు ప్రతీ ఒక్కరికీ నెలకు రూ. 3 వేలు భృతి ఇస్తామంటూ ఎన్నికల్లో ప్రచారం చేశారు. దీంతో నిరుద్యోగులు ఎంతో ఆశతో ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ కొలువుల కోసం కష్టపడి ఆర్థిక సమస్యలతో ఆగిపోయిన వారంతా నిరుద్యోగ భృతి అందితే పోటీ పరీక్షల కోచింగ్‌కు అవసరమవుతాయని భావిస్తున్నారు. తక్షణమే నిరుద్యోగ భృతిని అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

మళ్లీ పాత పాటే:

2014లో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో నిరుద్యోగుకలు ప్రతీ నెల రూ. 2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని ప్రగల్భాలు పలికారు. 2019లో ఎన్నికల ముందు రెండు నెలల భృతి ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఆ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు చేశారు. అలాగే ఇంటకో ఉద్యోగం ఇస్తామని చెప్పి చేతులెత్తేశారు. ఇప్పుడు కూడా చంద్రబాబు తమను మోసం చేస్తారేమోనన్న ఆవేదనలో నిరుద్యోగులు ఉన్నారు.

తక్షణమే ఇవ్వాలి..



కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన వెంటనే 20 లక్షల ఉద్యోగాలు.. లేని పక్షంలో నెలకు రూ. 3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అధికార పగ్గాలు చేపట్టి ఏడాది పూర్తయినా అతీగతి లేదు. అసలు ఇస్తా? లేదా?అనే విషయంపై స్పష్టత లేదు. 2019 ఎన్నికల ముందుకు తూతూ మంత్రంగా ఇచ్చారు. ఇప్పుడు అదే పంథా కొనసాగించేందుకు ప్రయత్నించడం చంద్రబాబుకే చెల్లింది.

– బి. ధర్మారావు, నిరుద్యోగి, రెయ్యిపాడు

హామీలన్నీ నెరవేర్చాలి



జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. గతంలో మాదిరి కాకుండా తక్షణమే భృతిని ప్రకటించాలి. ఒక్క నెల నోటిఫికేషన్ ఆలస్యమైతే ఉద్యోగానికి లక్షలాది మంది వయో పరిమితి దాటి ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత కోల్పోతారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతీ ఇంటికీ ఉద్యోగం ఇవ్వాలి. లేకుంటే నిరుద్యోగ భృతిని అమలు చేయాలి.

– జి. సాయిగోపాల్, పలాస

మాట నిలుపుకోవాలి



కూటమి ప్రభుత్వ నిరుద్యోగ భృతిపై మాట నిలుపుకోవాలి. ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయినప్పటికీ సీఎం చంద్రబాబుతో పాటు విద్య, ఐటీ శాఖ మంత్రి లోకేష్ ఇంత వరకూ ఎలాంటి ప్రకటన చేయలేదు. దీనిపై మాలాంటి నిరుద్యోగుల్లో అనుమానం కలుగుతోంది. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలపై సీఎం చంద్రబాబు స్పష్టత ఇవ్వాలి

– బి. గణేష్, నిరుద్యోగి, గుణ్ణలపాడు

చంద్రబాబు మోసాలు ప్రజలు గుర్తించాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



క్యూఆర్ కోడ్ కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

సోంపేట: రాష్ట్రంలో అధికారంలోకి రావడం కోసం అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా చంద్రబాబు చేసిన మోసాలు ప్రజలు గుర్తించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా విజయ అన్నారు. పలాసపురం గ్రామంలో మండల పార్టీ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల ముందు చంద్రబాబు సూపర్‌సిక్స్‌తో పాటు 143 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా మోసం చేశారన్నారు. చంద్రబాబు చేసిన మోసాలతో కూడిన క్యూఆర్ కోడ్ కరపత్రాలు పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలు అందజేయక పోవడం వలన ఎంత నష్టపోయారో వివరించారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలను అందజేశామని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, మండల పార్టీ అధ్యక్షులు శిలగాన భాస్కరరావు, పార్టీ బీసీ సెల్ రాష్ట్రకార్యదర్శి నర్తు నరేంద్ర, సర్పంచ్ తడక జోగారావు, ఎంపీటీసీ సభ్యుడు పోలాకి రమణమూర్తి, పార్టీ నాయకులు పిరియా గోవింద్, బల్లెడ ప్రసన్న, దుద్ది ధర్మారావు, తోట లోకనాథం, దేవాడ దుర్యోధన, బడ్డి బాలరాజు పాల్గొన్నారు.

విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేయండి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీవీఈవో సురేష్ కుమార్

వజ్రపుకొత్తూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులను ఎంసెట్, నీట్ పరీక్షలకు సిద్ధం చేయాలని అధ్యాపకులను జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి ఎ.సురేష్‌కుమార్ ఆదేశించారు. గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. పక్కాగా తరగతులు బోధించి వారాంతపు పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఇంటర్ బోర్డు ఇచ్చిన ఆదేశాల మేరకు సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల రికార్డులను, అధ్యాపకుల టీచింగ్ నోట్స్, డైరీలను, ప్రయోగశాలలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి కళాశాలకు సమయానికి హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ పట్నాయక్, అధ్యాపకులు ఝాన్సీ, కేశవరావు, రాంబాబు, రూపసుందర్, రమణ పాల్గొన్నారు.

వర్షం నీరు, ఇసుక మేటలు తొలగింపు



పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రస్వామి, సెక్రటరీ రాంబాబు

కంచిలి: మండల కేంద్రం కంచిలి మెయిన్‌రోడ్డు పక్కన ఆక్రమణలతో చిన్నపాటి వర్షానికి నీరు నిలిచిపోతోంది. ఈ విషయమై స్థానికుల ఫిర్యాదుతో పంచాయతీ యంత్రాంగం స్పందించింది. పంచాయతీ కార్యదర్శి ఎన్ని రాంబాబు పర్యవేక్షణలో ఇసుక మేటలను జేసీబీ సాయంతో శనివారం తొలగించారు. మెయిన్‌రోడ్డు మీదకు వచ్చిన కొందరు ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వనున్నట్టు సెక్రటరీ తెలిపారు. పనులను డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రస్వామి పరిశీలించారు.

కొండచిలువ హతం!



పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి చినబాడాం పాత జాతీయ రహదారిపై సుమారు ఆరు అడుగుల కొండచిలువ శనివారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో హల్ చల్ చేసింది. అటుగా వెళ్తున్న వాహనదారులు రోడ్డపైకి వచ్చిన కొండచిలువను చూసి ఆందోళన చెందారు. కొంతమంది ధైర్యం చేసి కర్రలతో కొట్టి హతమార్చారు.

ఇంటి పత్రాలు ఉన్నప్పటికీ వేధిస్తున్నారని ఆవేదన!



తహసీల్దార్‌కు ఇంటి పత్రాల జిరాక్స్ కాపీలను అందజేస్తున్న బాధితుడు సంతోష్‌కుమార్

టెక్కలి: తమ ఇంటికి అన్ని పత్రాలు ఉన్నప్పటికీ చిన్నపాటి కట్టడాలను అడ్డుకుని వేధిస్తున్నారంటూ టెక్కలి మండలం చాకిపల్లి గ్రామానికి చెందిన కత్తుల సంతోష్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం గ్రామ సర్పంచ్ వాన తవిటయ్యతో కలిసి తహసీల్దార్ సత్యంను కలిసి ఇంటి పత్రాల జిరాక్స్‌లతో పాటు వినతిపత్రాన్ని అందజేశారు. చాకిపల్లి గ్రామంలో కత్తుల వెంకట్రావు, ప్రమీలరాణికి చెందిన ఇంటి ఆవరణలో చిన్నపాటి రేకు షెడ్డును నిర్మాణం చేస్తున్న క్రమంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు ఆయా నిర్మాణాన్ని అడ్డుకున్నారు. అయితే ఎవరు ఫిర్యాదు చేశారని అడగగా ఎటువంటి సమాధానం చెప్పకుండా ఇంటి పత్రాలను తహసీల్దార్‌కు చూపించాలని ఆదేశించారు. దీంతో వెంకట్రావు కుమారుడు సంతోష్‌కుమార్ తమ ఇంటికి సంబంధించిన పత్రాలను తహసీల్దార్‌కు చూపించారు. ఇదిలా ఉండగా వెంకట్రావు కుమారుడు కుమార్ గత ప్రభుత్వంలో గ్రామ వలంటీర్‌గా పనిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హైదరాబాద్ వలస వెళ్లిపోయారు. ఈ క్రమంలో అన్నిరకాల ఇంటి పత్రాలు ఉన్నప్పటికీ కట్టడాలను అడ్డుకుంటున్న దానిపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ తమపై కక్ష సాధింపు చర్యలు లేకుండా న్యాయం చేయాలని బాధితులు వెంకట్రావు కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

డీఎస్సీ ఫలితాల్లో నిరోషా ప్రతిభ



నిరోషాను అభినందిస్తున్న కుటుంబ సభ్యులు



బల్లోజు హరీష్ బొమ్మిడి డిల్లేష్

టెక్కలి: డీఎస్సీ ఫలితాల్లో పరశురాంపురం గ్రామానికి చెందిన కురమాన నిరోషా పీజీటీ సోషల్ విభాగంలో 85 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. అలాగే స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 89.55 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు, జిల్లాస్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. టీజీటీ సోషల్ విభాగంలో 81.04 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 14వ ర్యాంకు, జోనల్ స్థాయిలో 7వ ర్యాంకు సాధించారు. టెక్కలి ఎంజేపీ ఏపీ బాలికల పాఠశాలలో పదో తరగతి వరకు చదివిన నిరోషా, ఎస్ఎల్‌వీఆర్‌జీఎస్ఆర్‌వీ నిమ్మకూరులో ఇంటర్ పూర్తి చేశారు. శ్రీకాకుళం మహిళా కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. టెక్కలి బీఎస్ అండ్ జేఆర్ కళాశాలలో 2020–22 సంవత్సరంలో బీఈడీ పూర్తి చేశారు. బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో ఎంఏ ఎకనామిక్స్, ఏయూ దూర విద్య ద్వారా ఎంఏ ఇంగ్లిష్ పూర్తి చేశారు. 2024లో టెట్‌లో 130.12 మార్కులు సాధించారు. భర్త వెంకట్రావు ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ కొల్లివలసలో బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. భర్త, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తాను ఇంతటి విజయం సాధించినట్లు నిరోషా తెలిపారు. తండ్రి వెంకట్రావు అండర్ గ్రాట్యుయేట్ డిప్లమో ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పూర్తి చేసి పలుమార్లు డీఎస్సీ రాసినప్పటికీ ఉద్యోగం రాలేదు. ఆ తరువాత క్వారీలో పనిచేస్తూ ఇద్దరు కుమార్తెలను చదివించారు. తండ్రి సాధించలేని విజయాన్ని కుమార్తె సాధించి తండ్రికి బహుమతిగా ఇచ్చారు.

స్నేహితుల సత్తా..

ఇచ్ఛాపురం: డీఎస్సీ ఫలితాల్లో ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన స్నేహితులు పీజీటీ, టీజీటీ విభాగంలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకులను సొంతం చేసుకొన్నారు. వీరిద్దరు స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలలో పదవ తరగతి వరకు, ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు) ఇంటర్మీడియెట్ విద్యను పూర్తిచేశారు. రత్తకన్న గ్రామానికి చెందిన బల్లోజు హరీష్ టీజీటీ–సివిక్స్‌లో 76.5 మార్కులతో రాష్ట్రస్థాయిలో మొదటిర్యాంక్, టీజీటీ–సోషల్‌లో 83.47 మార్కులతో రాష్ట్రస్థాయిలో ఐదవ ర్యాంక్, పీజీటీ–సోషల్‌లో 74.5 మార్కులతో 6వ ర్యాంక్, ఎస్ఏ–సోషల్‌లో 88.53 మార్కులతో జిల్లాస్థాయిలో తృతీయ ర్యాంక్‌ని సాధించాడు. అలాగే పట్టణానికి చెందిన బొమ్మిడి డిల్లేష్ టీజీటీ–సోషల్ స్టడీస్‌లో 84.20 మార్కులతో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్, పీజీటీ–సివిక్స్‌లో 69 మార్కులతో రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంక్, పీజీటీ సోషల్‌లో 74.5 మార్కుతో 5వ ర్యాంక్ .. ఎస్ఏ–సోషల్‌లో 83.72 మార్కులతో జిల్లాస్థాయిలో 9వ ర్యాంక్‌ని సొంతం చేసుకున్నాడు.

జూదశాలగా సంపద తయారీ కేంద్రం!



నందిగాం మండలం గొల్లూరులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పేకాటకు నిలయంగా మారింది. గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆనుకొని ఉన్న ఈ కేంద్రంలోకి కొందరు చేరుకొని పేకాట సాగిస్తున్నారు. అలాగే మద్యం తాగేసి మరి కొందరు అక్కడే పడుకొని ఉంటున్నారు. చెత్త నుంచి సంపద తయారీ మాట పక్కన పెడితే కేంద్రం జూదశాలగా మారడం, తాగుబోతులకు అడ్డాగా మారుతున్నా అధికారులు అటు వైపు చూడడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ కేంద్రంపై దృష్టి సారించి చెత్త నుంచి సంపద తయారీ చేసి పంచాయతీ ఆదాయం పెరిగేలా చూడాలని స్థానికులు కోరుచున్నారు.

–నందిగాం

డ్రైనేజీ పనులకు భూమిపూజ



పారిశుద్ధ్యం బాగుంటేనే ప్రజల ఆరోగ్యాలు బాగుంటాయని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. సోంపేట మండలం పలాసపురం గ్రామంలో జెడ్పీ నిధులు రూ. పది లక్షలతో నిర్మాణం చేపడుతున్న డ్రైనేజీ పనులకు శనివారం భూమి పూజ చేశారు. జెడ్పీ నిధులతో గ్రామాలు అభివృద్ధి చేయడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమలలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు శిలగాన భాస్కరరావు, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర, సర్పంచ్ తడక జోగారావు, ఎంపీటీసీ సభ్యుడు పోలాకి రమణమూర్తి పాల్గొన్నారు.

–సోంపేట

తేనెటీగల పెంపకంపై అవగాహన



స్వయంశక్తిసంఘాల మహిళలు, రైతులు తేనెటీగల పెంపకంద్వారా ఆర్థికాభివృద్ధికి అవకాశం ఉంటుందని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం కవిటి మహిళా సంఘం భవనంలో రైతులకు తేనెటీల పెంపకంపై అవగాహన కల్పించారు. తేనెటీగల పెంపకం పద్ధతులు, వాటి ద్వారా ఆదాయం పొందేమార్గాలను సిబ్బంది వివవరించారు. ఒకయూనిట్ ధర రూ. 82,525 చెల్లించిన రైతులకు ఈ పథకం కింద 10 తేనెపెట్టెలు, 13 రకాల పరికరాలు అందించనున్నట్టు తెలిపారు కవిటి ఏపీఎం కె.గోవిందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

–కవిటి

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సోంపేట: గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. పాలసవల గ్రామంలో శనివారం నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర'కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ట్రైనీ కలెక్టర్ పృధ్వీరాజ్‌కుమార్, తహసీల్దార్ బి.అప్పలస్వామి, ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

జానపదం ఝల్లుమన్నది..



ప్రజాకళామండలి కళాకారుల ఆటాపాటలు



కంబాలరాయుడుపేటలో ప్రముఖ కవి బమ్మిడి సుబ్బారావును ఉద్దానం కళాబంధు బిరుదుతో సత్కరిస్తున్న దృశ్యం

పలాస: పలాస నియోజకవర్గంలోని ఉద్దానం ప్రాంతంలో శుక్రవారం రాత్రి ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా ఘనంగా జానపద ఉత్సవాలు జరిగాయి. వజ్రపుకొత్తూరు మండలం కంబాలరాయుడుపేటలో ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో సాయంత్రం ఆరు నుంచి రాత్రి 12 గంటల వరకు ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 11 మంది పౌరాణిక జానపద కళాకారులు పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఇందులో భక్తకవి నక్కీర పాత్రధారి బోనం గురుమూర్తి (రణస్థలం)కు ప్రథమ బహుమతి లభించింది. అలాగే చంద్రమతి పాత్రధారి నల్లబాటి అన్నపూర్ణ (శ్రీకాకుళం) ద్వితీయ బహుమతి, హరిశ్చంద్రపాత్రధారి లుట్ట సత్యన్నారాయణకు తృతీయ బహుమతి లభించింది. వివిధ జిల్లాలకు చెందిన మరో ఐదుమందికి ప్రోత్సాహక బహుమతులు లభించాయి. ఈ సందర్భంగా ఉద్దానం ప్రాంతానికి చెందిన ప్రముఖ కవి, సాహిత్య విమర్శకులు బమ్మిడి సుబ్బారావుకు ఉద్దానం బంధు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమం తెప్పల కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగింది. కారి రాజుతుల సమ్మ చారిటబుల్ ట్రస్టు అధినేత తూలాడ గురునాథం, ఉద్దానం సాహితీ సాంస్కృతి అధ్యక్షుడు లండ రుద్రమూర్తి, శివజ్యోతి, వివిధ గ్రామాల నుంచి వచ్చిన కళాకారులు పాల్గొన్నారు.

బహాడపల్లిలో..

పలాస మండలం బాహాడపల్లి గ్రామంలో సిక్కోలు జానపద సాహిత్య వేదిక ఆధ్వర్యంలో జానపద వేడుకలు జరిగాయి. ముందుగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో యు.సంధ్య (హరిపురం), ఆర్.హర్షిత(హరిపురం), పి.దీక్షిత (హరిపురం) టి.హనిత (గరుడభద్ర)లకు వరుసుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో బహుమతులు అందజేశారు. అలాగే జానపద, సామాజిక గేయాల పోటీలను నిర్వహించారు. మొదటి బహుమతి కోనారి హేమసూదన్ (బెండి), రెండో బహుమతి నక్క వాసు (లొహరబంద), మూడో బహుమతి చెల్లూరు జయంతి (బైపల్లి) గెలుచుకున్నారు. విజేతలకు మందస ఎంపీపీ డొక్కర దానయ్య చేతులు మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు రాపాక ధనరాజు, మామిడి క్రిష్ణారావు, గొరకల లోకేశ్వరరావు, కుత్తుం వినోద్, సాలిన మాధవరావు, దున్న రామారావు బత్తిన రామారావు, పుక్కళ్ల రాజేంద్ర పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
టెక్కలి 7093164422
పలాస / ఇచ్ఛాపురం 9010178979
Office mail : sklmadvt@gmail.com